# "నారాయణ"

నారాయణ వచ్చినట్టున్నాడు. అవును, ఆ కంఠం అతనిదే. నేను పడకగదిలోంచి వెలుపలికి వెళ్ళలేదు. ఏదో పుస్తకం చదువుతున్నాను. అప్పటికి రాత్రి పదిగంటలు దాటింది.

నారాయణ అంటే నాకు అయిష్టం—అయిష్టమేకాదు, ఒక విధమైన భయంకూడా. మనిషి జలగలాగ పట్టుకుంటాడు. ఆతరువాత అతన్ని వదిలించుకోవడం కష్టం. అతని మనస్తత్వం కూడా అతి విచిత్రమైంది. మనం అవునన్నది, అతడు కాదంటాడు—కాదన్నది అవునని వాదిస్తాడు. ప్రతి మనిషినిగూర్చి చులకనగా మాట్లాడుతాడు. నీలాపనిందలు అంటకడుతాడు. చీటికి మాటికి కయ్యానికి కాలు దువ్వుతాడు.

ఒకమాటు మాటల సందర్భంలో రఘునిగూర్చి ఏవేవో సంగతులు చెప్పాడు. జ్ఞానమున్న మనిషి ఎప్పుడూ అతను చెప్పిన సంగతులు నమ్మలేదు. "రఘు ముండల ముఠాకోరు. రాముం కష్టపడి సంపాదిస్తే, వాడు డబ్బంతా తగలపెడుతున్నాడు. భార్యమాటగానీ, తల్లిమాటగానీ లక్ష్యంచేయడు. వెళ్ళిననాడు కోర్టుకు వెడతాడు, లేకపోతే లేదట. ఒకవేళ వెళ్ళినా ఏమాత్రం డబ్బు సంపాదించలేదు. పూర్తిగా అప్రయోజకుడు." నా ఎదుటే నా స్నేహితుని అడ్డమైన మాట లనడం నేను సహించలేకపోయాను. "రఘు సంగతి నీకన్నా నాకు బాగా తెలుసనీ, వాడు అప్రయోజకుడు

ఏమాత్రం కాదనీ, చాలా తెలివి కలవాడని'' నేను వాదించాను.

దానితో నారాయణకు అరికాలిమంట నెత్తికెక్కింది. ''నువ్వేమాత్రం ఏమంత బుద్ధిమంతుడవని'' మొదలెట్టాడు. నన్ను అనరాని మాట లన్నాడు. వాగ్వివాదం పోట్లాటలోకి దిగింది. చేతులు చేతులు కలుపుకునే పరిస్థితికి వచ్చింది. చుట్టుప్రక్కల వాళ్ళంతా కలుగజేసుకొని మమ్మల్నిద్దర్నీ విడ దీశారు. అప్పటినుంచీ మా ఉభయుల మధ్య మనస్పర్థలు పెరుగుతూ వచ్చాయి. ఒకరితో ఒకరం మాట్లాడ్డం మానుకున్నాము.

అల్లాంటి నారాయణ, ఆ రాత్రి అమాంతంగా ఊడి పడడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. గది వెలుపలికి వెడితే పోచికోలు కబుర్లతో, చిరాకు కలిగించి, పది గంటల్ని రెండు గంటల్లోకి మార్చివేస్తాడని భయం వేసి, నిద్ర నటించాను.

ఉదయం టీ తాగుతుండగా నారాయణ వచ్చి నా ప్రక్కన కూర్చున్నాడు.

ఎంత శత్రువైనా, ఇంటికి వచ్చిన మనిషితో మాట్లాడకుండా ఎల్లా ఉండగలను? ''రామం రఘూ క్షేమంగా ఉన్నారా'' అని అడిగాను.

నారాయణ నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పడం అతనికి మొదటినుంచీ అలవాటు లేదు.

''నువ్వూ, రఘు మోస్తరే లావెక్కుతున్నావే?'' అన్నాడు. జవాబుగా నేను చిరునవ్వు నవ్వాను.

రామం, రఘూ నా చిన్ననాటి స్నేహితులు. అన్న దమ్ము లిద్దరిలో పెద్దవాడు రామం నా క్లాసుమేటు. మేము ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకున్నామంటే అతిశయోక్తి ఏమీ ఉండదు. రోజుకు రోజూ మా స్నేహితం పెరుగుతూ వచ్చింది. ఈ మధ్యనే వాళ్ళని చూడక ఆరునెల్లు కావస్తున్నది.

"నీ జీతం ఎంత ?"

చెప్పాను.

"ప్రయోజకుడి నయినా" వని సంతోషిస్తాడని ఆశించాను. కాని అటువంటి దేమీ జరగలేదు.

నారాయణని చూడక రెండుసంవత్సరాలైంది. ఈ మధ్య అతని అన్నయ్య చనిపోయాడు. ఉబుసుపోక, "రఘు ప్రాక్టీస్ చేస్తున్నాడా ?" అని అడిగాను.

"చేస్తున్నాడంటే, చేస్తున్నాడు—లేదంటే లేదు" అతని డొంకతిరుగుడు సమాధానం—నాకు ఏమీ అర్థంకాలేదు.

వితండవాదానికి అతనికి పెట్టిందిపేరు. ఏసంగతి నిక్కచ్చిగా తేల్చి చెప్పక పోవడానికి అతనికి అతనే సాటి.

"రామం వ్యవసాయం బాగా సాగుతున్నదా ?"

"ఏమి వ్యవసాయమో ఏమో ? అవసరమైనప్పుడు, చేతిలో పట్టుమని పదిరాళ్ళు ఉండవు."

నారాయణ సహజధోరణి క్రమంగా బైటపడుతున్నది. అతను ఎందుకింత డొంక తిరుగుడుగా సమాధానాలు చెబుతాడో ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోదు.

"నీవు పల్లెర్లలోనే వుంటున్నావా ?" పల్లెర్ల నారాయణ స్వగ్రామం.

"బ్రహ్మచారిని, ఒకవ్వాళ్ళో నికరంగా వుండడానికి వీలుంటుందా? నేనెక్కడ వుంటే అదే నాకు పల్లెర్ల".

బ్రహ్మచారి కావడమేనా, అతని వితండవాదానికి కారణం? ఏమో—మనం ఏదీ స్పష్టంగా తేల్చి చెప్పలేము.

చిట్టిబాబు నాప్రక్కన కూర్చుని కర్ర పిడికిలి కంకుతూ బోసినవ్వులు నవ్వుతూ, కేరింతలు కొడుతున్నాడు.

"పేరేమి పెట్టారు?"

బోసినవ్వులు కావు—ఆకర్షిస్తే బాబు కేరింతలే నారాయణని ఆకర్షించి ఉంటాయి.

"ఇంకా పేరు పెట్టలేదు" సమయం దొరికింది నారాయణని ఏడ్పించటానికి.

"ఏడాది దాటినట్టున్నది—ఇంకా పేరు పెట్టకపోవడమేమిటి?"

"ఏమో?"

"బారసాలనాడు ఏ పేరుతో పిలిచారు?"

"ఎవరికి తోచిన పేరు వాళ్ళు పెట్టారు—ఎవరికిష్టం వచ్చినట్టు వాళ్ళు పిలుస్తున్నారు".

"మరి నువ్వేమని పిలుస్తున్నావు?"

గట్టి చిక్కులో పడ్డాను. ఏమని చెప్పాలో వెంటనే తోచింది కాదు.

"చెప్పవేం? ఏమని పిలుస్తున్నావ్?"

చప్పున ఆలోచన తట్టింది.

"చిట్టిబాబు" అని చెప్పాను.

విజయ గర్వంతో చిట్టిబాబుని వళ్ళోకి తీసుకొని గట్టిగా ముద్దు పెట్టుకున్నాను.

బాబు, "లాలా, లాలా" అని ఉత్సాహంగా అరుస్తున్నాడు.

"గట్టి వాడేనే?"

"కాదు – బొత్తిగా పిరికిపంద"

"అదేమిడ అల్లా మాట్లాడుతావు?"

"మాట్లాడ్డ మేమిటి? నిజం చెబుతున్నాను."

నారాయణ ధోరణి కొంతవరకు నాకు అలవడినట్లు తోచింది.

"నిజ మేమిటి?"

"అబద్ధం కానిది."

నారాయణ నావేపు చుర చుర చూచాడు. ఎందుకు అల్లా చూస్తాడు? ఓడిపోతున్నానని ఉక్రోషమా? చూపులు తప్పించుకొని పై చెయ్యి నాదే నని గర్వంతో తిరిగి బాబును ముద్దు పెట్టుకున్నాను.

"లాలా, లాలా" అని తిరిగి బాబు అరుస్తున్నాడు.

నారాయణ ఏమీ మాట్లాడకుం లేదు.

నొచ్చుకున్నాడా?

ఏమో?

నారాయణ రామం, రఘూలకు మేనమామ. నాకన్నా ఒక పాతిక సంవత్సరాలు పెద్ద. ముగ్గురమూ, అతన్ని నారాయణ అనే పిలుస్తాం. అతనంటే మాలో ఏ ఒక్కరికీ గౌరవం లేదు. మేమే కాదు. ఊళ్ళో వాళ్ళందరికీ అంతే.

అంతసేపు, అతను మౌనంగా ఉండడం, నే నెన్నడూ చూడలేదు.

మనిషి, ఈ మధ్య ఏమైనా సీరియస్‌గా మారి పోయినాడా?

నారాయణ, ఇంకా, మౌనంగానే ఉన్నాడు.

ఆ మౌనాన్ని భరించడం, నాకు కష్టంగా తోచింది.

"ఇందిర బాగుందా?"

ఇందిర నారాయణ అన్న కూతురు — రఘు కిచ్చి పెళ్లి చేశారు.

"ఏమి బావుంది? ఈ మధ్య జబ్బు పడితే, బ్రతుకు మీద ఆశ వదులు కున్నారు."

"జబ్బేమిటి?"

"ఏమి జబ్బని చెప్పాలి — ఒకరు టైఫాయిడ్ అంటే ఇంకొకరు నిమోనియా అంటారు."

నారాయణ మళ్ళీ తన ధోరణిలో పడుతున్నాడా?

"మరి ఇప్పు డెల్లా ఉంది?"

"ఎల్లా ఉందని చెప్పను? తగ్గిందని గాని, హెచ్చిందని గాని చెప్పడానికి వీలులేదు."

"ఉపచారం చేయిస్తున్నారా?"

"కనపడిన డాక్టరు కల్లా చూపిస్తున్నారు. కాని ఏమీ లాభం లేకపోతున్నది.

నారాయణ మాటల్ని నమ్మనా?

"ఉప్పరి పల్లెలోనే ఉన్నారా?"

"ఇంకెక్క డుంటారు — అవసరమైనపుడల్లా పట్నం వచ్చి డాక్టర్లని తీసుకెడుతున్నారు."

"చీటికీ మాటికీ డాక్టర్లని మార్చడం మంచిది కాదేమో?"

"ఈ డాక్టర్లకి ఎక్కడి డబ్బూ చాలడం లేదు. పదిహేను రోజుల క్రితం, రెండు వందల రూపాయలు పంపించమని రఘు నాకు వ్రాశాడు." నారాయణ ఏ బాధ్యతా తన నెత్తిపైన వేసుకోడు.

"మరి పంపించావా?" అని అడిగాను.

"పంపించక ఏమి చేస్తాను – అన్నయ్య పోయిన తరువాత, అతనికి అత్తవారి వేపు వాడిని, నేనొక్కడినే కదూ మిగిలింది."

ఇందిర తల్లి అంతకు ముందే చని పోయింది.

విసుగుతో అంటున్న మాటలా అవి?

"జబ్బు పడకముందు అమ్మాయిని ఒక మాటు చూడటానికి వెళ్ళాను. రఘు ఒక వంద రూపాయలు అడిగాడు. నేను రఘుకి డబ్బివ్వడం చూసి, 'బాబాయి! ఎక్కడి డబ్బూ, వారికే ఇస్తావు. నేనేమి పాపం చేశాను. నా కెందు కివ్వ' వని అడిగింది."

"మరి ఇచ్చావా?"

"లేదు. వంద రూపాయలు తప్ప, నా దగ్గిర అప్పట్లో డబ్బేమీ లేకపోయింది."

"పోనీ, మీ ఊరికి వెళ్ళి పంపించలేక పోయావా?"

"పంపిద్దామనే అనుకున్నాను, కాని అప్పట్లో చేతిలో డబ్బు ఆడలేదు."

ఏమిటీ నారాయణ నిజంగా మారిపోయినాడా?

నారాయణకి దాదాపు ఏభై సంవత్సరాలు ఉంటాయి.

"ఇంతలోకే అమ్మాయి జబ్బుపడింది. అప్పుడప్పుడు రఘు నాదగ్గరినుంచి డబ్బు తెప్పించుకుంటూనే వున్నాడు— పాపం ఈ మధ్య అతనికి ఎక్కడిడబ్బూ చాలడంలేదు."

"అయితే, ఇందిరకి, ఇంతకీ డబ్బు పంపించలేదన్న మాట."

"ఏ మొహం పెట్టుకొని పంపించను? ఎన్నడూ చిల్లి గవ్వ యివ్వని బాబాయి తను చావుకు సిద్ధంగా ఉండడం గమనించి, డబ్బు పంపించాడని, ఇందిర అధైర్య పడుతుం దేమో నని భయంవేసింది."

నారాయణ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. నలుసు ఏదో కళ్ళల్లో పడినట్టు నటిస్తున్నాడు. అతని అన్నయ్య బ్రతికి వున్నంత కాలం, నారాయణ ఏ బాధ్యతా ఎరగడు. కాగా, అతను బ్రతికివుండగా, అతన్ని ఎదిరించి తిరిగాడు. అతను చనిపోవడంతో, నారాయణకి జీవితంలో ఏదో వెలితి కనపడింది. "నా" అనేవాళ్ళు ఎవరా అని ఆలోచించాడు. ఇందిరా, రఘూలు కనపడ్డారు. దానితో జీవితంలో, ఒకలక్ష్యం ఏర్పడింది. తన ప్రేమనంతా వాళ్ళపైన కేంద్రీకరించాడు. వాళ్ళకి ధనసహాయం చేయడం తన విధి అని భావించాడు. ఇందిర తన స్వంతానికై డబ్బు అడగడం, సమయానికి అతను డబ్బు యివ్వలేకపోవడం, అతని మనస్సులో గొప్ప కల్లోలాన్ని కలుగచేసింది. ఇందిరకి డబ్బు యివ్వలేక పోయానే, అనే బెంగ అతన్ని పట్టి వేధించింది. ఇందిర ఇంతలోకే జబ్బు పడింది. చావు బ్రతుకులమధ్య గిలగిల తన్నుకుంటున్నది. అట్టి సందర్భంలో డబ్బు యిస్తే, ఎన్నడూ తనని డబ్బు అడగని ఇందిర, ఏమనుకుంటుందో అని నారాయణకి

భయంవేసింది. అందుకోసం కొంతకాలం ఆ యింటి ఛాయలకి వెళ్ళడం మానుకున్నాడు. అట్టి పరిస్థితుల్లో, ఇందిరకి డబ్బు యివ్వడమా, మానడమా, అనే సంధిగ్ధావస్థలో పడ్డాడు. ఏదీ తేల్చుకోలేని స్థితిలో, మధ్యలో, పట్నంలో మజిలీ వేశాడు. డబ్బు యిస్తే ఒక చిక్కు—ఇవ్వక పోతే ఇంకొక చిక్కు—దయార్ద్రి హృదయం. ఎటూ తేల్చుకోలేక, గిలగిల తన్నుకుంటున్నదని, నాకు అప్పట్లో మొదటిసారిగా తోచింది.

ఆ సున్నిత హృదయాన్ని, నేను ఓదార్చ గలిగితే... అలలు, అలలుగా ఆలోచనలు వచ్చి నన్ను అగాధంలోకి దించాయి.

"మామయ్యా! ఇంక ఇందిర బ్రతక దంటావా?"

ముందుగానే, మామయ్యకుగల సందేహం నాకంఠంలో ధ్వనించింది.

"మామయ్యా" అని ఎందుకో నారాయణని సంబోధించడం అదే మొదటిసారి.

కన్నీరు, మామయ్య చెంపల మీదుగా కిందికి జారుతున్నది. "బ్రతకదనే నా నమ్మకం. చెప్పు నాయనా, ఎల్లా బ్రతికించుకోనో. నా ఇందిరని" అంటూ గొల్లు మన్నాడు మామయ్య.

అధైర్యం నన్నూ ఆవరిస్తున్నది.

"మామయ్యా! పోనీ నువ్వు ఒకమాటు వెళ్ళివస్తే."

"డబ్బు యివ్వడానికి వచ్చావా బాబాయి — అని అమ్మాయి గొల్లుమంటుంది — ఆ దృశ్యం నేను చూడలేను."

ఇందిర ఇక బ్రతకదని ఎందుకో నాకూ తోచింది.

అయినా "వెళ్ళడమే మంచిదని" నేను సలహా యిచ్చాను.

"నేను, వెడదామనుకునే పట్నం వచ్చాను - తీరా ఇంత దూరం వచ్చి, ఆ ఊరుకు వెళ్ళడానికి కాళ్లు ఆడడం లేదు.

పల్లెర్ల నుంచి పట్నం మీదుగా ఉప్పరిపల్లి వెళ్ళాలి.

"త్రిశంకు స్వర్గంలో వుండడంకూడా కష్టమే కదూ?"

"ఆ మాట నిజమే, కాని తీరా వెడితే, ఇంక చావు తప్పదని దిగులు పడుతుందేమో నని నా భయం."

"మామయ్యా, నీ పిచ్చికాని ఇందిర నిన్ను చూచి ఎందుకు దిగులు పడుతుంది చెప్పు, పైగా నువ్వు వచ్చావని సంతోషపడి త్వరగా కోలుకుంటుంది."

"నిజం చెబుతున్నావా నాయనా."

"నిజంకాకపోతే, అబద్ధంమాట్లాడుతానామామయ్యా."

రైలు కింకా అరగంట టైముంది. ట్యాక్సీ తెప్పిస్తాను. ఈ బండికే వెళ్ళిపో."

మామయ్య ట్యాక్సీకదులుతుండగా, నావేపు దిగులుగా చూచి, "ఇందిర బ్రతుకుతుందా నాయనా" అని తిరిగి అడిగాడు.

"తప్పక బ్రతుకుతుంద"ని ధైర్యం చెప్పి, "ఆఁ, పోనియ్యి" మని డ్రైవర్ని తొందర పెట్టాను.

కారు రయ్యిన పరుగెత్తింది.

కారు వంకచూస్తూ, నిశ్చేష్టుడనై గుమ్మం ముందర నిలబడ్డాను.

★